



# మనసు మనసే

మణి నవకాంత్

నీలి ఆకాశంలోకి చూస్తోంది నీలిమ.

డబ్బు సంపాదిస్తానని దుబాయ్ వెళ్ళిపోయిన భర్త గురించే ఆమె ఆలోచన అంతా. అత్త అరడింపులూ మామ మొరాయింపులూ ఆమె గుండెను మరింత రాతిబండగా మార్చేయి.

ఆమె చేతిలో పెళ్ళినాటి ఫోటో వుంది. రోజూ రాత్రి పడుకునేటప్పుడు ఆ ఫోటోని చూసుకొని నిద్రలోకి జారుకుంటుంది. కానీ ఈరోజు ఇంకా నిద్ర రావటం లేదు. ఆకాశం వైపు చూస్తూనే వుంది.

నిండు పున్నమి పండు వెన్నెలని భూదేవికి ప్రసాదిస్తోంది. కానీ తన మనసులోని చల్లని వెన్నెలని భర్తకి అర్పించాలని ఆమె ఆశ.

తన భర్త గోపాలం పట్టుదల గల మనిషి. ఇంటిల్లిపాదీ పనికిమాలిన వెధవ అని తిడుతున్నా నీలిమ తట్టుకోలేకపోయేది. పెద్దవాళ్లు తిట్టే తిట్లకి ఎదురు తిరగాలన్నా తన భర్త పైసా సంపదన లేని అసమర్థుడు. ఏదో ఒక భృతి దొరికేంతవరకూ పాట్లు తప్పవని భర్తకి నచ్చచెప్పింది ఆవేశపడద్దంటూ.

తను ఉద్యోగం చేయటానికి తన భర్త ఒప్పుకోవటం లేదు.

గోపాలం కంటే నీలిమే ఎక్కువ చదువుకుంది. కష్టాలు పడుతూ ఖాళీగా కూర్చోవటానికి ఆమెకు మనస్కరించటం లేదు. పెళ్లికి ముందే నీలిమతో ఉద్యోగం చెయ్యటానికి వీల్లేదని కండిషన్ పెట్టాడు గోపాలం. పిల్ల బావుంది. పిల్ల కంటే కట్నం బావుందని పెళ్లికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారు గోపాలం తల్లిదండ్రులు. కట్నం డబ్బులు కాస్తా హారతి కర్పూరంలా అరాయించుకుపోయాయి. ఇక మనుషులు మిగిలారు.

పెళ్లి అయినా, బిడ్డ పుట్టినా కొడుక్కి ఉద్యోగం రాలేదని కోడలు నీలిమ తన కొడుకు పాలిట శనిలా దాపరించిందంటీ అత్త శ్యామలాంబ.

అది నిజమేనంటూ వంత పాడాడు ఆమె భర్త పురుషోత్తమరావు.

గోపాలం స్నేహితుడు ధర్మరాజు దుబాయ్ వెళ్ళి నెలకో మూడు వేలు చొప్పున ఇంటికి పంపిస్తున్నాడు. ధర్మరాజు తాపీ పని చేస్తూ అంతో ఇంతో డబ్బు కూడగట్టుకుని ఓ పాతిక వేలు దాకా ఖర్చు పెట్టి దుబాయ్ వెళ్ళాడని గోపాలానికి తెలుసు. నాలుగు డబ్బులొచ్చే పని ధర్మరాజు చేతిలో వుంది కనుక ఎక్కడున్నా మహారాజే! కానీ తనకి అంత డబ్బు ఎలా వస్తుంది? ఉద్యోగం కోసం ఆశలు

పెట్టుకుని ఎంప్లాయిమెంట్ ఏక్ఛేంజీల చుట్టూ, ఎమ్మెల్యేల చుట్టూ, తెలిసిన పెద్దవాళ్ళ చుట్టూ తిరగటంతోనే సరిపోయింది. పెళ్ళయ్యాక ఒక పిల్లాడు కూడా పుట్టడంతో మేకుల కంపెనీలో రోజువారీ కూలీగా చేరాడు. ఏదో చేస్తున్నాడు కానీ అతనికి సంతృప్తి లేదు. ధర్మరాజు దుబాయ్ వెళ్ళిపోయాడు. తనూ వెళ్ళిపోవాలనే! ధర్మరాజుకయితే డబ్బు వుంది. కానీ తనకెక్కడిది? ఉన్నది అర ఎకరం పొలం. అది అమ్మితే ఏ పాతిక వేలో ముప్ఫయి వేలో రావచ్చు. తీరా అమ్మి వెళ్ళిం తర్వాత ఉద్యోగం రాకుండా పోతేనో?! అలా ఎంతోమంది వెళ్ళి డబ్బు పోగొట్టుకుని నానా తిప్పలు పడ్డారని అతని భయం. కానీ కళ్ళ ముందు ధర్మరాజు అక్కడ్నించి ఇక్కడికి డబ్బు పంపిస్తూంటే - ఏమైనా సరే దుబాయ్ వెళ్ళే తీరాలని నిశ్చయించుకుని తండ్రి దగ్గరికి వచ్చి అడిగాడు.

తండ్రి ఇవ్వలేదు సరికదా - పెళ్లాం పిల్లాడుతో సహా ఇంట్లోంచి బయటికి వెళ్ళిపొమ్మన్నాడు. గత్యంతరం లేక కాలాన్ని వెళ్ళబుచ్చుతున్నాడు.

చివరికి భర్త దిగులుపడుతుంటే 'నేను వెళ్ళి మా నాన్నని అడిగి వస్తానండీ' అంటూ వాళ్ళ వూరు వెళ్ళింది నీలిమ.

వాళ్ళదీ మధ్యతరగతి కుటుంబమే. ముగ్గురు అన్నదమ్ములు ఒకే ఆడపిల్ల నీలిమ. గోపాలం తిరిగి తీర్చే పద్ధతిలో తలో పదివేలు ఇస్తామని చెప్పారు.

గోపాలానికి ఏనుగు ఎక్కినంత పనయింది.

ఆఘమేఘాల మీద దుబాయ్ వెళ్ళడానికై ఏజెంట్లని కలిశాడు.

అక్కడికి వెళితే ఏ ఇటుకలు మోసి అయినా డబ్బు సంపాదించొచ్చు అని అతని ఆలోచన. ఈలోగా కారు నడపడం అలవాటయితే ఏదైనా కారు నడపవచ్చు అని కారు నడపడం నేర్చుకోవటానికి చేరేడు. తండ్రి పురుషోత్తమరావుకయితే సుతారమూ ఇష్టం లేదు. ఎంత వద్దని చెప్పున్నా కూడా వినిపించుకోలేదు.

కష్టమో నష్టమో కలో గంజో ఏదో ఇక్కడే పడితే బావుంటుందని ఆయన వుద్దేశ్యం. బ్రతికితే దర్జాగా కొన్నాళ్ళయినా బ్రతకాలి అని గోపాలం ఆశ. ముగ్గురు బావమరుదల దగ్గరా డబ్బు తీసుకుని బొంబాయి వెళ్ళేడు గోపాలం.

భర్త వుంటుండగానే హీనంగా చూస్తున్నారు. ఇక లేకపోతే ఏం బాధ పెడతారోనని పుట్టింటికి వెళ్ళిపోతానంది నీలిమ దానికి కస్సుమన్నాడు పురుషోత్తమరావు.

"వాడెలాగూ దేశాలు పట్టుకునిపోతున్నాడు. నా మనవడ్ని కూడా నా నుంచి దూరం చెయ్యడానికి వీల్లేదు..."

"వారు తిరిగి వచ్చేప్పటికీ చాన్నాళ్ళవుతుంది కదండీ. మావాళ్ళ దగ్గరికి వెళ్ళితే కొంచెం మనశ్శాంతిగా వుంటుందనీ" అంది నీలిమ మామగారితో.

"అంటే మా దగ్గరుంటే నీకు మనశ్శాంతి కరువైపోతుందా...?" అంటుండగా అటునుంచి శ్యామలాంబ వచ్చింది.

"ఏమైందండీ?"

"ఏముందీ... వాడు పోతే... ఇదీ పోతుందంట..."

"ఎక్కడికండీ?"

"పుట్టింటికట... చూడమ్మా నీలిమా, నువ్వు పుట్టింటికి వెళ్ళటానికి నాకేం అభ్యంతరం లేదు. కానీ నా వంశానికి సారధి నా మనవడు నా దగ్గరే వుంటాడు. ప్రయాణానికి బట్టలు సర్దుకో. వాడు వెళ్ళిన తక్షణమే..."

"ఏమిటి మీరనేది?"

"అవును. ఎల్లుండి సాయంత్రం వాడు బండి ఎక్కుతున్నాడు. ఈలోగా నువ్వు నోరు మెదిపితే మర్యాద దక్కదు..."

"కన్నతల్లిని... నానుండి పసి పిల్లాడ్ని వేరు చెయ్యటం భావ్యమేనా?" గాద్గదికంగా అడిగింది నీలిమ.

"అయన యజమాని. నువ్వు ఎదురు మాట్లాడకు. చెప్పింది చెయ్యటమే నీ వంతు. మా వాడి దగ్గర నువ్వేదైనా పేలితే పళ్ళు పీకి చేతిలో పెడతాను జాగ్రత్త!... పదా... అబ్బాయి వస్తున్నాడు" కోపంగా అంది అత్త శ్యామలాంబ. భర్త గొంతు విన్పించటంతో అటు రూంవైపు కదిలింది నీలిమ, అత్త అన్న తూటాల్లాంటి మాటల్ని మనసులో ఇమిడ్చేసుకుంటూ.

"నీలిమా! ఇటురా" గదిలోకి పిలిచాడు భర్త.

"ఉండండి. బాబుని పడుకోబెట్టి వస్తాను" అంటూ వత్తిగిలి నిద్రోతున్న పిల్లాడ్ని పడుకోబెట్టింది.

చిన్నగా వెనక్కి వెళ్లేడు గోపాలం. ఆమెని దగ్గరికి తీసుకోబోయాడు.

"ఏయ్. ఏమిటీ అల్లరి" గోముగా అంది తప్పించుకుంటూ.

"నన్ను వదలి దూరంగా వెళ్లిపోతున్నారుగా" అంటోన్న ఆమెలో దుఃఖం ఆగలేదు.

"అది సరే... మళ్లీ ఎప్పుడు వస్తారండీ"

"ఇంకా వెళ్లలేదు... పనిలో చేరలేదు. డబ్బు పంపలేదు. ఈలోపే ఎప్పుడు తిరిగి వస్తానంటున్నావేంటి నీలిమా... నన్ను నిరుత్సాహపరచకు ప్లీజ్."

"నిరుత్సాహపరచాలని కాదండీ మళ్లీ ఎన్నాళ్లకు చూస్తానా ఈ అల్లర్లు అని."

"ఓహ్... అదా... ఒక్క సంవత్సరం అయ్యేటప్పటికల్లా ఠక్కున ఇక్కడికొచ్చి వాలతాను."

"అంటే మూడు వందల అరవై అయిదు రోజులా!"

"మన మంచికే కదా నీలిమా... నేనిప్పుడు కష్టపడితే రేపు నా కొడుకు సుఖపడతాడు. నేను నిర్లక్ష్యం చేస్తే రేపు వాడూ నాలా బాధలు పడతాడు. అందుకే నేనీ నిర్ణయం తీసుకున్నాను. చూడూ... నువ్వు పిల్లాడితో ఇక్కడ ఏం అవస్థలు పడతావ్... పోనీ... మీ ఇంటికి వెళతావా."

"చూడండి... పుట్టింటి గడప దాటిన ఆడది మెట్టింటిలోనే గడపాలనే సాంప్రదాయం మనది. కష్టాలు పడుతున్నామని పుట్టింటికి వెళ్లిపోతే ఆడదాని జీవితానికి అర్థం ఏముంటుంది చెప్పండి?

"ఎప్పటికైనా మెట్టింటిలోనే ఆడదాని జీవితానికి పరమార్థముంటుంది. అందుకే ఇక్కడే ఉందామనుకుంటున్నాను."

మూడు నెలలు గడిచింది.

బొంబాయి వెళ్ళిన గోపాలం జాబుకానీ జాడకానీ తెలియరాలేదు. అత్త మామల వేధింపులు ఎక్కువయ్యాయి. అయినదానికి కాని దానికీ గొడవ పెట్టి ఆమెను మరింత బాధపెడుతున్నారు. తన భర్త ఇక్కడ వున్నప్పుడు అడపాదడపా అయిదో పదో అమ్మానాన్నలకిచ్చే వాడు కుటుంబాన్ని పోషించేవాడు. కూర్చోపెట్టి మేపవలసి వస్తున్నదని మామ పురుషోత్తమ రావు నీలిమని నానా మాటలు అంటున్నాడు. నిజానికి ఆమెకి పుట్టింటికి వెళ్ళాలని వున్నా కన్న కొడుకుని తీసికెళ్ళడానికి వీల్లేదన్నాడని నోరు మూసుకుని పడివుంది, ఏనాటికైనా భర్త తిరిగి వస్తాడని.

భర్త క్షేమ సమాచారాలు తెలిసివుంటే ఆమె ధైర్యంగా వుండేది. కానీ వాళ్ళ బాధలవలన నీలిమి మరింత క్షీణించి పోతోంది. ఏదైనా పనిచేసుకుని బ్రతుకుతానంటే బ్రతకనివ్వరు. పిల్లాడికి ఒక్క బిస్కట్టు ముక్క కొనటానికి కూడా అత్త మామలని అడగవలసి వచ్చిన తన పరిస్థితికి ఎంతో బాధపడేది. గోపాలం వుంటే ఎప్పుడైనా పనిలోంచి వస్తూ బిస్కట్లు అవీ తెస్తూండేవాడు.

"అమ్మా... నాన్న.... బిత్తత్తులు.." అంటున్న కుర్రాడ్ని ఆమాట అన వద్దని కొట్టటం తప్పించి ఏమీ చేయలేక పోయేది. కుర్రాడు కూడా తండ్రి గురించి చాలా బెంగ పెట్టుకున్నాడు.

బాంధవ్యాల్ని మరిచిపోయి బ్రతక గలగటం ఎంతో సహనంతో కూడిన పని. బంగారు భవిష్యత్తు కోసం మనసుని కట్టుదిట్టం చేసుకోవటం ఒక తపస్సు లాంటిదే. ఆ తపస్సులో గెలుపు అందరికీ లభిస్తుందా అన్నది సందేహమే.

గోపాలం మొండి మనిషి. అనుకున్నది సాధించి తీరాలి అంటాడు.

భర్తతో ఎన్నోసార్లు వాగ్వివాదానికి దిగింది. చివరికి అతని ఆశయానికి మెచ్చుకుని ఊరుకునేది నీలిమ.

"ఏవండీ... చందమామ అందంగా వుందని దాన్ని సొంతం చేసుకోవాలనుకోవటం అవివేకం కాదా?" అంది నీలిమ.

"అందమైన చందమామ మనకెందుకులే అని వూరుకుంటే భూమ్మీంచి అక్కడికి వెళ్ళ గలిగేవారా? నీలిమా! దేనికైనా సాహసం, పట్టుదల వుండాలి."

"అలాగా అయితే అంత సాహసం పట్టుదలా వుంటే సూర్యుడి దగ్గరికి వెళ్ళమనండి చూద్దాం..."

"ఏముందీ... వెళ్తారు...."

పక్కున నవ్వింది నీలిమ.

"ఏమండీ... నేల మీద నించొని గాలిలో తేలాలనుకోవడం అవివేకం అండీ. మనకున్న పరిధిలోనే మనం ఆలోచించాలి. మనకున్నదానిలోనే సంతృప్తి చెందాలి..."

"నో.... నేను ఒప్పుకోను నీలిమా! నన్ను పక్కదారి పట్టించటానికి ప్రయత్నం చెయ్యకు. నేను నేల మీదే నించుంటాను. గాలిలోనే తేలాలనుకుంటాను. మనిషి అనే వాడికి ఈ పట్టుదలే లేకపోతే ప్రపంచంలో ఇన్ని మార్పులు జరిగేవా? ఎవడి మట్టుకు వాడు

నాకెందుకులే అంటూ నేల మీదే కూర్చుంటే ఈనాడు చదువుకోవాలి అనే జ్ఞానం ప్రతి ఒక్కరి లోనూ కలుగుతుందా? నువ్వేచెప్పు. రాళ్ళతో నిప్పును పుట్టించి మనిషి చైతన్య వంతుడయినట్టే మనిషి ఆలోచనలని కూడా చైతన్యవంతం చేయాలి నీలిమా"... అతనిలో ఆవేశం ఆగలేదు.

"ఆ ప్రయత్నంలో విఫలుడైతే.." అంత ఆవేశం గానూ అడిగింది నీలిమ.

"విఫలమైనంత మాత్రాన ప్రయత్నం ఆగిపోదు.. సాగి పోతూనే వుంటుంది. కాకపోతే ఒకటి - ప్రయత్నంలో గెలుపు ఓటమిలు సర్వసామాన్యం. గెలిచిన వాడు ధన్యుడు.... ఓడిన వాడూ...."

'ఊ చెప్పండి....'

"ఓడిన వాడూ ధన్యుడే"

"అదేమిటో?"

"ఓటమి వల్లే గెలుపు విలువ తెలుస్తుంది. ఓటమే గెలుపుకి మొదటి మెట్టు

"మీరు మొండి వారండి... కర్ర విరగదూ.... పాము చావదూ... మీతో గెలవటం కష్టం..."

"నువ్వు మాత్రం తక్కువా..." నవ్వుతూ అన్నాడు గోపాలం.

oooo

భర్త తలపులే ఆమెని కలవర పెడుతున్నాయి.

నిద్ర పట్టని నీలిమ గుండెల్లో పేరుకున్న గుబులు - మూడు నెలల తర్వాత భర్త దగ్గర్నించి వచ్చిన ఉత్తరం!

ఆ ఉత్తరం చదివిన పురుషోత్తమరావు భగ్గున మండిపోయాడు. ఆ మంటకి కాస్త పెట్రోలు పోసింది శ్యామలాంబ.

"దేభ్యం మొహమా! వాడు పోతాను అన్నాడే అనుకో నీ చదువుకున్న తెలివి ఏమైందట? పైగా వాడి మాటకి తందాన తాన అంటూ మీ అన్న దమ్ముల చేత డబ్బు ఇప్పించావా?... అయినా నిన్ను అని ఏం ప్రయోజనం? చదువుకున్న పిల్లని కోడలిగా తెచ్చుకుంటే మమ్మల్ని ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగిస్తుంది జాగ్రత్త అని వూరూ వాడా అంటే ఏంటో అనుకున్నాను. ఇప్పుడు మేం ఆరు చెరువులు నీళ్ళు తాగేక ఇంక ఏం అనుకుని ఏం ప్రయోజనం?" అంది శ్యామలాంబ.

"ఇప్పుడేమైంది అత్తయ్యా?" అడిగింది నీలిమ.

"ఏమో... నాకేం తెలియటం లేదు. అదేదో మీరే చెప్పండి భర్తతో అంది శ్యామలాంబ.

"ఏముందీ.. ఆ దౌర్భాగ్యుడు అయిదు వందలు పంపమన్నాడు. అయిదు వందలు కాదు కదా.. అయిదు పైసలు కూడా లేదు. ఉన్న సొమ్ము కాస్తా గుల్ల అయి వుంటుంది. ఇక తిరిగి రావటానికనుకుం టాను ఈ డబ్బు... వాడి చావు వాడ్ని చావమని ఉత్తరం రాసేస్తాను. నువ్వు మళ్ళా మీ అన్నల దగ్గ రికెళ్ళి డబ్బు పంపించే పిచ్చి పిచ్చి పనులు చేస్తే నడిరోడ్లో వుంటావు జాగ్రత్త..."

"ఏమండీ.. మీ అబ్బాయి మీద మీకెందుకండీ అంత ద్వేషం...

"ద్వేషం కాదు. వాడికి ముప్పయి అయిదేళ్ళు వచ్చినా జ్ఞానం తెలియటం లేదు. వాడి తోటి వాళ్ళు పదిహేనేళ్ళకే పొట్ట పోసుకుంటూ అమ్మా నాన్నల్ని పువ్వుల్లో పెట్టి చూసుకుంటున్నారు. కానీ మా దౌర్భాగ్యుడు మమ్మల్ని చూడక్కర్లేదు వాడి బ్రతుకు వాడు బ్రతికితే చాలు. దురాశకి పోయి కుటుంబానికి ఆసరా అవ్వకుండా మా ప్రాణాల్ని తోడేస్తున్నాడు...."

అంటుండగా నీలిమ ముగ్గురు అన్నదమ్ములూ వచ్చారు.

వాళ్ళపై విరుచుకు పడ్డాడు పురుషోత్తమరావు. నన్ను సంప్రదించుకుండా మీరెందుకు డబ్బు ఇచ్చారని.

గోపాలం బొంబాయి నుంచి రాసిన వుత్తరం విషయం తెలిసి అతను దుబాయ్ వెళ్ళలేదని నిప్పు తొక్కిన కోతిలా రెచ్చిపోయారు ముగ్గురన్న దమ్ములు.

అటు అత్తమామల సాధింపులు ఇటు అన్న దమ్ములు కూడా ఛీదరించటంతో భరించ లేక పోయింది నీలిమ.

కానీ తను ఏం చేయగలదు?

పైకి రావాలని ఆరాట పడుతున్న భర్తకి చేయూత నివ్వాలని అప్పు ఇప్పించింది ఎంతో ఉన్నతమైన తన భర్త ఆశయానికి కళంకం ఏర్పడుతుందని తను ఊహించలేదు.

ఆ డబ్బు తీర్చేంత వరకూ తమ గడప తొక్కడా నికి వీల్లేదని మొహాన తిట్టి పోయారు ముగ్గురన్న దమ్ములు.

'అసలే మొండి మనిషి. ఏం కష్టాలు పడుతు న్నారో ఏంటో" సుఖానవున్న ప్రాణాన్ని తీసికెళ్ళి నిప్పుల్లో పోసుకున్నట్లుగా చేసుకుంటున్నారు.ఇప్పుడు తండ్రి రాసే వుత్తరం చూస్తే ఆయన ఏం అఘా యిత్యం చేసుకుంటారో ఏంటో "ఓటమి కూడా గెలుపే అనేంత మనో ధైర్యం వున్న మనిషే అయినా పరిస్థితులు అనుకూలించక పోతే....."

ఆలోచనలు ఆమెని నిలవనీయటంలేదు.

ఎలాగైనా భర్తకి డబ్బు పంపాలని అనుకుంది. కానీ ఏ పనీ పాటా లేని వంటి ఇంటి కుందేలు అయిన తనకి ఎలా సాధ్యమవుతుంది?

నోరారా అడుగుదామనుకున్న అన్నదమ్ములే అసహ్యించుకున్నారు. అత్త మామలు సరేసరి. మరెలా?

అతనితోనే తన జీవితం, తన కొడుకు బంగారు భవిష్యత్తు ముడిపడి వున్నాయి. అతనే లేకపోతే?... ఆమె బ్రతకటమే దుర్లభం. అతనిపై ఆమెకెంత అనురాగం?...

భార్య భర్తల మధ్య ఒకరిపై ఒకరికి మమకారం వుండబట్టే ఈ జీవితాలన్నీ సాఫీగా వెళ్ళిపోతున్నాయి. ఆ ఆప్యాయతలే కరువైతే తట్టుకోలేని సంఘటనలని ఎదుర్కుంటూ కాలాన్ని వెళ్ళబుచ్చ గలరా?

తను జీవితాంతం సుఖ పడాలని తన భర్త అన్ని కష్టాలని ఏరికోరి తెచ్చుకున్నాడు. తను కష్ట పడటానికి ఒప్పుకోవటం లేదు. తన భర్తే లేకపోతే తన జీవితం గతి ఏమౌతుంది?

భర్త ఉత్తరంలోని ఆవేదనని గ్రహించిన నీలిమ సూత్రాలు అమ్మి డబ్బు పంపాలని నిర్ణయించు కుంది.

"ఏమోయ్ గోపాలం! నీకు మీనాన్న డబ్బు పంపాడనుకుంటాను పోస్టమేన్ వచ్చి వెళ్ళాడు" లాండ్రీ షాపు ఓనర్ శంకరం గోపాలంతో అన్నాడు.

"మా నాన్నడబ్బు పంపటమేమిటండీ. ఒక వేళ వున్నాకూడా మా నాన్న తిడతాడు.."

"మరి తిట్టడా.. నువ్వు చేసిన పనులకి.. అదే నేనయితే ఏం చేసే వాడినో తెలుసా - చర్మం చీరి కారం అంటించే వాడిని..... అదిసరే మరి ఆ డబ్బు ఎవరు పంపివుంటారు?"

"ఇంకెవరు నా భార్య.. ఆమె దేవత. ఆమె లేకపోతే నేనేలేను."

"మరి ఈ తెలివి నువ్వు మీ వూర్లో వున్నప్పుడే మయింది?"

"అప్పుడూ ఇప్పుడూ నేనెప్పుడూ ఒక్కటే.. కాక పోతే నాకు టైం కలిసి రావటంలేదు."

"బాబూ... ప్రతీ వాడికీ అంతే... టైం అంటూ దానంతట అది కలిసిరాదు. టైముకి అనుగుణంగా మనం మారుతూ వుండాలి. చూడు... నువ్వు చేతి లో వున్న పనిని పోగొట్టుకున్నావు. ఉన్న డబ్బుని ఏజెంట్లకి తగల బెట్టి నానా పాట్లు పడుతున్నావు. ఈ బొంబాయి మహానగరంలో నేనే నిన్ను ఆదుకోక పోతే నీ పరిస్థితి ఏమయ్యేది చెప్పు....? అయినా ఇంటికి డబ్బు పంపమని ఉత్తరం రాశావే... వాళ్ళ దగ్గర లేదని తెలుసుగా... మరెందుకు రాశావ్?"

"ఏ అప్పు అయినా చేసి పంపుతారని..."

"తీర్చే స్తోమత లేని పరిస్థితిలో అప్పు మాత్రం అడిగిన వెంటనే ఎలా పుడుతుంది చెప్పు... గోపాలం.. ఒక్క విషయం చెప్పనా?.. మనిషికి సంపాదనే ముఖ్యం అనుకుంటే దుబాయ్ వెళ్ళక్కర్లేదు.. నాతో రా" అంటూ శంకరం తన ఇంటికి గోపాలాన్ని తీసికెళ్ళాడు.

శంకరం ఒక లాండ్రి షాపు నడుపుతూ జీవనం గడుపుతున్నాడు. ఓ రోజు సొమ్మసిల్లి పడిపోయిన గోపాలం తెలుగులో మాట్లాడటం గమనించిన శంకరం అతడిని తన షాపు దగ్గరికి తీసుకొచ్చి ఆశ్రయమిచ్చాడు.

శంకరం తన భార్య పిల్లల్ని గోపాలానికి పరిచ యం చేశాడు.

"ఆమె నా భార్య... ఎమ్.ఎ. వరకూ చదువు కుంది. ఒక ప్రైవేట్ ఫర్మ్‌లో ఉద్యోగం చేస్తోంది. నెలకి రెండువేల అయిదు వందలు జీతం. నేను ఈమె కంటే తక్కువే చదువుకున్నాను. పదో తరగతే. అదీ తప్పాను. కానీ నా సంపాదన నెలకి ఎంతో తెలుసా... నెలకి పది వేలు. ఒకరి నొకరం అర్థం చేసుకుని జీవితం గడుపుతున్నాం. ఆమె చదువుకు న్నానని గర్వం చూపటం లేదు. నేను సంపాదిస్తున్నా నని అధికారం చెలాయించటం లేదు. ఇదేదో తక్కువ పని అని బాధపడటం లేదు. ఆనందంగా బ్రతుకుతున్నాం...."

గోపాలానికి శంకరం మాటలు ఆశ్చర్యం కలిగిం చేయి.

తను నీలిమ ఉద్యోగం చేస్తానంటే వద్దని కండి షన్ పెట్టేడు. తను ఆమెని సుఖ పెట్టింది లేదు. పైగా ఆమె ఎంతో శ్రమించి తనకోసం తన వాళ్ళ దగ్గరికెళ్ళి తనకి అప్పు ఇప్పించింది. ఆ సొమ్ము

కాస్తా సర్వనాశనమయిపోయింది. తను కష్టాలు పడటం కాకుండా తనవాళ్ళని కూడా కష్టాలపాలు చేసినందుకు ఎంతో మధన పడిపోయాడు గోపాలం.

ఆ రాత్రికి శంకరం ఇంట్లో వున్నాడు గోపాలం.

శత విధాలా నచ్చ చెప్పాడు శంకరం గోపాలానికి తిరగి వెళ్ళిపొమ్మని. గోపాలం తిరిగి వెళ్ళటానికి నిశ్చయించుకోలేదు.

మర్నాడు షాపుకి వెళ్ళారు శంకరం, గోపాలం.

"నేను దుబాయ్ వెళ్ళాలనుకోవటం తప్పంటారా?" అడిగేడు గోపాలం.

"తప్పని నేను అనను. కానీ ఇప్పుడు నీకో విషయం చెబుతాను. నీ అంతట నువ్వు సంపాదించుకున్న డబ్బుని నువ్వు నాశనం చేసుకున్నా ఇతరుల ప్రమేయం వుండదు. అప్పుడు తప్పు జరిగినా కూడా తప్పు అని ఇతరులకి అనిపించదు నీకే అర్థం అవుతుంది. అదే ఇతరుల డబ్బుని నువ్వు నాశనం చేసినప్పుడు నీకంటే ఎక్కువ వాళ్ళు బాధపడతారు. ఆ బాధలో నిన్ను తప్పు చేశావని వాళ్ళు ఎత్తి పొడుస్తారు. అప్పుడు నువ్వు చేసింది తప్పా? వాళ్ళు డబ్బు ఇవ్వటం తప్పా?"

మౌనంగా గోపాలం చూస్తూండిపోయాడు.

"నువ్వు చేసింది తప్పో ఒప్పో నీకే అర్థం అయిందనుకుంటాను."

ఈ మాటతో గోపాలం తల క్రిందకి దించేశాడు.

దిగులుగా కళ్ళ వెంబడి కన్నీరు కార్చేడు.

"కన్నీరు సమస్యలకి పరిష్కారం అవదు.. అవునా?"

"ఈ పరిస్థితిల్లో నేను ఏ ముఖం పెట్టుకుని తిరిగి వెళ్ళగలను?"

"ఏ ముఖం పెట్టుకునా?.... నిన్ను నమ్ముకున్న భార్యా బిడ్డ కోసం, కన్న వాళ్ళ కోసం..."

"నే వెళ్ళినా అక్కడ ధైర్యంగా బ్రతకలేను"

"అయితే ఏం చేస్తావ్.."

"నాకేం తోచటం లేదు"

"చూడు గోపాలం... సమస్యలని ధైర్యంతో ఎదుర్కోవాలి. నీకు డబ్బే సమకూర లేదనుకో... లేదా... ఎక్కడో పారేసుకున్నావనుకో అప్పుడేం చేసేవాడివి?"

"ఏముందీ... ఎటూ ఏదో మేకుల కంపెనీలో పనిచేస్తున్నాగా అదే చేసేవాడిని..."

"ఇప్పుడూ అదే చెయ్యి."

" నా వల్ల కాదండీ. నాకు ఇక్కడ ఏదైనా పని ఇప్పించండి. కనీసం నేను చేసిన అప్పైనా తీర్చేంత వరకూ నేనిక్కడ్నించి కదలను..." అన్నాడు గోపాలం ప్రాధేయపూర్వకంగా.

గోపాలంని తన షాపులో పెట్టుకున్నాడు శంకరం. అతని నమ్మకాన్ని బలపరుస్తూ తొమ్మిది నెలలు గడిచింది.

శంకరం గోపాలానికి ముప్పయి వేలు ఇచ్చాడు. ఆ డబ్బుతో తిరిగి ఇంటికి వెళ్ళిపోడానికి నిశ్చయించుకున్నాడు.

ఆ మరునాడు తన దగ్గర డబ్బు తీసుకున్న ఏజెంట్ కనిపించాడు.

"నీకు దుబాయ్ వెళ్ళటానికి అవకాశం వచ్చింది. బయలుదేరతావా?" అన్నాడు ఏజెంట్.

"ఇంకేం దుబాయ్... నువ్వు మళ్ళీ ఇంకో ఇరవై వేలంటే నేను మళ్ళా ఇక్కడ నా పెళ్ళాం పిల్లాడ్ని వదిలి ఇంకో సంవత్సరం వుండాల్సి వస్తుంది. నువ్వూ వద్దు... నీ దుబాయి వద్దు.... నన్ను వదిలి పెట్టు దేవుడా....'

అంటూ రెండు చేతులూ ఎత్తి దణ్ణం పెట్టేడు.

"చూడు బాబూ... నా చేత్తో ఎంతో మందిని దుబాయ్ పంపేను. నీ టైం బాగోలేదు పని అవలేదు. మీ వూరి ధర్మరాజు తిరిగి వచ్చేస్తున్నాడు.. నీ విషయంలో నన్నేం చెయ్యమంటావ్ చెప్పు?"

"నేను వెళ్ళను గాక వెళ్ళను" అన్నాడు గోపాలం.

"నువ్వెళ్ళద్దులే... నీ డబ్బు నీకు ఇచ్చేస్తాను.. నాతోరా" అన్నాడు.

ఏజెంట్ గోపాలానికి అయిదు వేలు ఖర్చయిందని మిగిలిన పదిహేను వేలు తిరిగి ఇచ్చేశాడు.

"నీ టైం బాగుంది కనుక ఈ డబ్బైనా దక్కింది. నేనిచ్చిన డబ్బుతో అప్పు తీర్చుకో. ఈ డబ్బుతో ఏదైనా వ్యాపారం చేసుకో" అన్నాడు శంకరం.

"మీ మేలు మరువలేనండి" అన్నాడు గోపాలం.

"చెప్పేనుగా... నీటైం బాగుందని... ఇంకెక్కడా ఆగకు.. ఇంటికి వెళ్ళిపో" అంటూ గోపాలాన్ని రైలు ఎక్కించాడు శంకరం.

✪✪✪✪

చావు తప్పికన్ను లొట్టు అయినట్టు కాకుండా డబ్బుతో వచ్చిన భర్తని చూసిన నీలిమ కన్నీరు కార్చింది. సంవత్సర కాలంలో జరిగిందంతా వివరంగా చెప్పేడు గోపాలం.

"ఇవి నలభై అయిదు వేలు. ముప్పై వేలు మీ వాళ్ళకిచ్చేద్దాం. అడిగితే అయిదు వేలు వడ్డీకి ఇచ్చి పది వేలు పెట్టి వ్యాపారం చేసుకుందాం... నువ్వూ ఏదైనా నీ కిష్టమైన ఉద్యోగంలో చేరుదువుగానీ" అన్నాడు గోపాలం.

"నాకు కావలిసింది ఈ డబ్బూ.. నేను ఉద్యోగం చెయ్యటం కాదు"

"మరేమిటి? చెప్పు నీలిమా..."

"మీ రెప్పుడూ నాకళ్ళ ముందే వుండాలి" ఆర్ద్రతగా అంది.

"ఎప్పుడూ నీ కళ్లముందే వుంటానుగా. కళ్ళు తెరిచి లోకాన్ని చూడటానికే ఈ బొంబాయి ఆ దుబాయి ఓ గుణ పాఠం." ఆమెని ఓదార్చేడు.

ఇన్నాళ్ళకి తిరిగొచ్చిన కొడుకు మాట విన్న తల్లిదండ్రులు ఏమనాలో తెలియక ఆనందంతో ఉప్పొంగి పోయారు.

అప్పుడే బయటి నుంచి వచ్చిన చిన్న కుర్రాడు గోపాలం దగ్గరికి వచ్చేడు.

"ఎవర్నువ్వు? ఎందుకొచ్చేవ్?" అన్నాడా కుర్రాడు.

"ఒరేయ్... ఎవరనుకున్నావ్‌రా... మీనాన్నరా..." అంది నీలిమ కొడుకుతో.

"నాన్నా! అయితే మళ్లీ వెళ్లి పోతారా?" అన్నాడా కుర్రాడు.

"బాబూ ఇంక వెళ్లనురా నీ దగ్గరే వుంటాను" అంటూ తన కొడుకును ఒక్క ఉదుటున ముద్దు పెట్టుకుంటున్న భర్తని చూసింది నీలిమ ఆనంద బాష్పాలు రాలుస్తూ. ❐❐

## ఇంట్లోనే చేసుకోండి!

# కాటుక తయారీ

కావలసిన వస్తువులు : గుంటగలగరాకు పసరు, తెల్లని పల్చని (పాత) నేత బట్ట కొద్దిగా, వస కొమ్ము 1, 1/4 కిలో ఆముదము, గంధం చెక్క, సాన, ఒక ఇత్తడి పళ్ళెం, ప్రమిద లేక మూకుడు, 3 పొయ్యి రాళ్ళు, వెన్న పూస, పచ్చ కర్పూరం కొంచెం, రాగి చెంబు.

తయారుచేసే పద్ధతి :

గుంటగలగరాకు తెచ్చి శుభ్రంగా కడిగి రోటిలో వేసి, కొద్ది కొద్దిగా నీళ్ళు పోస్తూ నూరి, పసరు తీయాలి. ఆ పసరుని ఒక మంచి గిన్నెలోకి పిండి ఉంచుకోవాలి. ఆకులోని పసరంతా ఈ విధంగా తీయాలి. చివరకు పల్చగా నీరులాగా వచ్చినప్పుడు పిప్పిని పారేయాలి. ఆ పసరులో తెల్ల బట్టను తడిపి పిండకుండా ఆరేయాలి. ఇలా పసరంతా అయిపోయే వరకూ చేయాలి. వసకొమ్ము మెత్తగా పొడిగొట్టి ఆ బట్ట బాగా ఆరాక ఆ బట్టలో వేసి వత్తిలాగా చేయాలి. ఆ వత్తిని ప్రమిదలో ఆముదం పోసి నాన బెట్టాలి. బాగా నానాలన్న మాట. తర్వాత సాన మీద కొంచెంగా నీరు పోస్తూ గంధం చెక్క అరగదీస్తూ గంధం తీయాలి. ఈ గంధాన్ని పళ్ళెం (పళ్ళెం శుభ్రంగా తోమి తుడవాలి) అడుగు భాగాన పల్చగా రాయాలి. మూడు రాళ్ళు పొయ్యి లాగా చేసి మధ్యలో, మనం తయారు చేసి నానబెట్టిన వత్తి ఉన్న ప్రమిదను ఉంచి వెలిగించి గంధం రాసిన పళ్ళెం దానిపై ఉంచి, పళ్ళెం నిండా నీళ్ళు పోయాలి. గాలి చొరని చీకటి ప్రదేశంలో వుంచి పైన చెప్పిన విధంగా చేస్తే కాటుక బాగా పడ్తుంది.

మరునాడు చల్లారాక పళ్ళానికి పట్టిన మసిని జాగ్రత్తగా శుభ్రమైన కాగితంలోకి తీసుకుని, కాటుక చేసిన పళ్ళెం మీదనే వేసి వెన్న పూస కానీ, ఆముదం కానీ వేసి రాగి చెంబుతో మెత్తగా నూరాలి. పచ్చ కర్పూరం కూడా కొద్దిగా వేసి బాగా నూరాలి. అంతా కలిసేలాగా అలా నూరాక మళ్ళా శుభ్రమైన నీరు పోస్తూ (కొళాయి తిప్పి ఆ ధార క్రింద కూడా నూరవచ్చు) మళ్ళీ బాగా నూరాలి. ఇలా చేయటం వల్ల నలకలవీ పోయి శుభ్రమైన కాటుక తయారవుతుంది. తడి ఆరాక ప్లాస్టిక్ భరిణలో కానీ, రాగి భరిణిలో కానీ వుంచి వాడుకోవాలి. నూనె చెయ్యి, పౌడర్ చేయితో కాటుక వాడితే కాటుక మందుతుంది.

ఇదే విధంగా నిమ్మరసంలో గుడ్డ తడిపి ఆర వేసి కాటుక తయారు చేయచ్చు. అంటే గుంటగలగరాకు రసం బదులు నిమ్మరసం వాడాలి. అంతే.

-పాలగుమ్మి పద్మా విజయ్